క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ రైల్వే ట్రెనింగ్ సెంటర్ ఫీడర్ పరిధిలో విద్యుత్‌వైర్లు మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీయల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, రైల్వేక్రాసింగ్ సెంటర్ ఏరియా, శ్రీనగర్ కాలనీ ఒకటో లైను, జీరోలైన్, రెండో రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వృద్ధుడు అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధుడు అదృశ్యంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవీనగర్ ఒకటోలైన్ మొదటి క్రాస్‌రోడ్డుకు చెందిన కె.హేమలత, భర్త, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. భర్త కె.వెంకట కృష్ణమూర్తి (69) రైల్వేలో చీఫ్ కంట్రోలర్‌గా పనిచేసి 12 సంవత్సరాల క్రితం రిటైర్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు టిఫిన్ చేసివస్తానంటూ చెప్పి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు.

18న మహాశివరాత్రి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్య నగర్ దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన ఈ నెల 18 న మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు రాత్రి 9 గంటల నుంచి లింగోద్భవ కాలం వరకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి కళ్యాణం వేదపండితులచే జరుగుతుందన్నారు. భక్తులు మహాశివరాత్రి మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్చరీ విజేతలకు ఏడీఆర్‌ఎం అభినందనలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ఆలిండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఒక బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించిన విజయవాడ రైల్వే డివిజన్‌లోని కమర్షియల్ విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.చరణ్‌రెడ్డి, ఎస్ అండ్ టీ విభాగంలో హెల్పర్ సునేందు రాయ్‌లను ఏడీఆర్‌ఎం డి.శ్రీనివాసరావు అభినందించారు. జనవరి 29 నుంచి 31 వరకు చిత్తరాజన్‌లో జరిగిన 12వ ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో చరణ్‌రెడ్డి బంగారు పతకం సాధించగా, సునేందురాయ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. సోమవారం మర్యాపూర్వకంగా ఏడీఆర్‌ఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌ఎం వారికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభతో మరిన్ని పతకాలు సాధించి విజయవాడ డివిజన్ పేరుప్రతిష్టలు పెంచేలా కృషిచేయాలని ఆకాంక్షించారు.

మురుగు నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్):గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ , వినాయకనగర్‌లలో సోమవారం మురుగు నీటి నిల్వ ప్రాంతాల్లో మలేరియా విభాగం సిబ్బంది ఆయిల్ బాల్స్ వేశారు. సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఒక వేళ తాజా నీటి నిల్వలు ఉంటే గంబూషియా చేపలు, మురుగునీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయటం ద్వారా దోమలను లార్వా దశలోనే అంతం చేసే అవకాశం ఉందన్నారు.

రామకృష్ణాపురంలో గ్యాంగ్‌వర్క్



మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత తప్పక పాటించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బి.జానారెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రామకోటేశ్వర రావు సూచించారు. రామకృష్ణాపురంలో పారిశుధ్య సిబ్బంది చేపట్టిన పనులను సోమవారం పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గుర్తింపు రద్దు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని నవసమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సభలు, రోడ్ షోల పేరుతో అమాయకుల ప్రాణాలు బలితీసుకున్న టీడీపీ గుర్తింపు తక్షణమే తొలగించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను లేఖ ద్వారా కోరామన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వంలో సెంట్రల్ మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల సంక్షేమ, అభివృద్ధి పాలనకు చంద్రబాబు 14 ఏళ్ల అనుభవం ఏమాత్రం సాటిరాదని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గవర్నర్‌పేట 23వ డివిజన్‌లోని 98వ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు కేక్ కట్ చేశారు. తొలుత 98వ సచివాలయ పరిధిలోని రాజగోపాలచారి వీధి, అలీబేగ్ వీధి, డి.టి.రావు వీధి, మేరీ వీధి, క్యానం వారి వీధి, కాజా పున్నయ్య వీధి, మసీదు వీధి, అట్లూరత్తయ్యవీధి, గోపువారి వీధి, గూడవల్లి వారి వీధి, బందర్ రోడ్డు, గోపాలరెడ్డి రోడ్డులలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ పేట అంటేనే వ్యాపార సముదాయాలకు కేంద్ర బిందువని.. అటువంటి ప్రాంత అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి ఈ ప్రాంత రూపురేఖలు మార్చామని చెప్పారు. అలాగే టీడీపీ కార్పొరేటర్లు ఉన్న ప్రతి ఒక్క డివిజన్‌ను మూడున్నరేళ్లలో అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఎందుకు గెలిపించుకోలేకపోయామనే భావన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. 150 రోజుల్లో 54 సచివాలయాల పరిధిలో 51,105 ఇళ్లను సందర్శించామని తెలిపారు. ప్రజల నుంచి లభించిన స్పందన అపూర్వమని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు.

బొండా ఉమా బహిరంగ చర్చకు సిద్ధమా..?

సెంట్రల్ నియోజకవర్గంలో పర్యటించే కనీస అర్హత బొండా ఉమాకు లేదని డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా వ్యాఖ్యలపై సోమవారం ఆమె తీవ్రంగా స్పందించారు. ఎవరి హయాంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందో ప్రజల మధ్యనే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు చొరవతో 58వ డివిజన్ పరిధిలో రూ. 22 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయని.. పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వివరించారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, ఒగ్గు విక్కీ డీఈలు గురునాథం, రామకృష్ణ, రామకోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి లయన్స్ క్లబ్ వద్ద ఈ- వేస్ట్ సేకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఈ- వ్యర్థాలు, వ్యర్థ పదార్థాల సేకరణ, రీ సైక్లింగ్ చేపట్టి పర్యావరణ పరిరక్షణకు లయన్స్ క్లబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని భావించిందని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి తెలిపారు. గవర్నర్‌పేటలోని లయన్స్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 7 నుంచి నెల రోజుల పాటు లయన్స్ క్లబ్‌లో వద్ద ఈ వేస్ట్ సేకరణ చేపడతామన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రారంభిస్తారన్నారు. ఇళ్లలో వాడి పాడైపోయిన, నిరుపయోగంగా ఉన్న, పనికిరాని ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు, కంప్యూటర్, లాప్ టాప్, ప్రింటర్, ఫాక్స్, సెల్ ఫోన్, లాండ్ ఫోన్, ఛార్జర్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కుక్కర్, టీవీ, డీవీడి, రిమోట్, స్టీరియో, టేప్ రికార్డర్, ఫాన్, హీటర్ లాంటి పరికరాల తయారీలో వాడే బెరీలియం, కాడ్మియం, మెర్క్యూరీ, సీసం వంటి మూలకాలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. రాజీవ్ నగర్లోని 278వ వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఆయన ముఖాముఖి నిర్వహించారు. రోజువారీ విధులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారం నిర్ణీత గడువులోగా చేయాలని సూచించారు. సంక్షేమ క్యాలెండర్‌పై ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. శానిటరీ సెక్రటరీ, పారిశుద్ధ్య సిబ్బంది టూర్ డైరీ కచ్చితంగా ఫాలో అవ్వాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణ వాహనం ప్రతి ఇంటికి వెళ్లేలా చూడాలని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల పై ఎమినిటీస్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం సచివాలయ పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డులపై ఆరా తీసిన ఆయన ఫీవర్ సర్వే క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఇంటి వద్ద ఫాగింగ్ నిర్వహించాలన్నారు. మహిళా పోలీస్ పాత్రకీలకమని, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. మహిళలచే దిశ యాప్ డౌన్‌లోడు చేసుకునేలా అవగాహన కల్పించినందుకు గాను అభినందించారు. జోనల్ కమిషనర్ సృజన, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి యేసు, కన్వీనర్లు తిరుపతిరావు, సాయిలలిత, నాయకులు మోదుగుల గణేష్, ఉద్దంటి శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ పార్కులో సందర్శకులకు ఆహ్లాదం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజీవ్ గాంధీ పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):రాజీవ్ గాంధీ పార్కుకు విచ్చేసే సందర్శకులకు ఆహ్లాదంతో పాటు వినోదం కూడా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నిర్వాహకులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలోని రాజీవ్ గాంధీ పార్కును సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ పార్కులో బయో డైవర్సిటీ మ్యూజియం, టోన్యాయ్ గార్డెన్, ఫౌంటెన్, స్కేటింగ్ రింగ్, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం అభినందనీయమని చెప్పారు. మొక్కల సంరక్షణతో పాటు వాటిని సుందరంగా తీర్చిదిద్దడంలో మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న మొక్కలకు అదనంగా ఉసిరి, మారేడు, రాయల్ పామ్స్, పారిజాతం, సీజనల్ ఫ్లవరింగ్ ప్లాంట్స్, వంటి మొక్కలను పెంచాలని సూచించారు. వివిధ రకాల జంతువులు, పక్షులకు సంబంధించిన అందమైన ఫొటోలను చెట్ల మధ్యలో అలంకరించాలని కోరారు. చిన్నారులు, పెద్దలకు వినోదాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పార్కులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన వేదికను ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలచేత సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు లోపల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మినీ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి తినుబండారాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పార్కు లోపల వెలుపల ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, పార్కు ఈఈ ప్రసాద్, ఏఈలు, డీఈలు ఉన్నారు.

గుణదల మేరీమాత ఉత్సవాలకు ఏర్పాట్లు

- 9 నుంచి 11 వరకు నిర్వహణ
- భక్తుల కోసం సదుపాయాల కల్పన



సమిష్టి దివ్యబలి పూజలకు ఏర్పాటు చేసిన వేదిక



యాత్రికుల కోసం సిద్ధమవుతున్న పందిళ్లు

గుణదల (విజయవాడ తూర్పు):గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా మరియమాత తిరునాళ్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. వీఎంసీ, విద్యుత్, పోలీసు అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు మొదలయ్యాయి. మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకునేందుకు అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు వేలాదిగా తరలి వస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రధానాలయం దిగువన ఉన్న బిషప్‌గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. యాత్రికులు సేద తీరేందుకు వీలుగా ఈ ఆవరణలోనే చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొండ ఎగువ భాగం వరకు యాత్రికులు వచ్చిపోయేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి తోడు పుణ్యక్షేత్ర పరిశరాలన్నిటిలో తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచుతున్నారు. మేరీమాత ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణంతో పాటు కొండ శిఖరాగ్రం వరకు పెద్ద ఎత్తున షిఫ్టుల వారీగా పోలీస్ పహారాకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉత్సవాల ముందు రోజు నుంచి పూర్తయ్యే వరకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటారు. దీనికి తోడు ఉత్సవాల మూడు రోజులు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోనున్నారు.

ఆర్టీసీ, రైల్వే శాఖల సమన్వయంతో....

గుణదల మేరీమాత ఉత్సవాలకు హాజరయ్యే యాత్రికుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక వాహనాలు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించారు. రైల్వే మార్గంలో చేరుకునే యాత్రికుల వెసులుబాటు కోసం గుణదల రైల్వే స్టేషన్ కు పలు పాసింజర్లు, ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమిష్టి దివ్య బలి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్‌కు కాయ్ గుర్తింపు



గుర్తింపు పత్రం అందజేస్తున్న రజినీష్ చౌదరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ (ఏపీఎస్‌కేఏ)కు తమ అనుబంధ సంఘంగా గుర్తింపు ఇస్తున్నట్లు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) జనరల్ సెక్రెటరీ షిహాన్ రజినీష్ చౌదరి చెప్పారు. ఈ మేరకు అనుబంధ గుర్తింపు పత్రాలను ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ చైర్మన్ యు. బ్రహ్మానందం, ప్రెసిడెంట్ జె. విజయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ జె. శ్రీనివాసులు, ట్రెజరర్ సి హెచ్.మహేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ జి. శేఖర్‌కు ఆయన అందజేశారు. సోమవారం విద్యాధరపురంలోని జెకె కరాటే అకాడమీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రజినీష్ చౌదరి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి ఈ అసోసియేషన్ కాయ్ గుర్తించిందన్నారు. కరాటే ను పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల స్థాయిలో ఆటగా గుర్తించారని చెప్పారు. రాష్ట్ర, జాతీయ ,అంతర్జాతీయ స్థాయిల్లో కరాటే పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మానందం, విజయకుమార్, శ్రీనివాసులు, మహేష్ బాబు, శేఖర్ మాట్లాడుతూ త్వరలోనే తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాలకు సంబంధించి కమిటీలను నియమిస్తామని తెలిపారు. కరాటే నేర్చుకునే విద్యార్థిని విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని మంచి ప్రతిభవంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇటీవల ఒంగోలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి నేషనల్‌కు ఎంపికైన జిల్లాకు చెందిన పలువురు కరాటే విద్యార్థులను అభినందించారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ ప్రజలకు అందించే మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార దిశగా ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల అర్జీలపై దృష్టి సారించాలని సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం 18 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక - 14, ఇంజినీరింగ్ - 2, రెవెన్యూ- 2 వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. దీనిపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారని పేర్కొన్నారు. స్పందనపై వారంవారం జరిగే సమీక్షలో అధికారులు పరిష్కార వివరాలు అందించాలని స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందనలో సర్కిల్ -3 కార్యాలయంలో ఒకటి, సర్కిల్ -1 లో రెండు అర్జీలు వచ్చాయి. సర్కిల్ - 2లో అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు. అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఎస్.ఇ నరసింహ మూర్తి, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్చి 3 నుంచి 13 వరకు మహిళా ఉత్సవ్



మాట్లాడుతున్న విద్యాకన్న

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):మహిళలు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు మార్చి 3 నుంచి 13 తేది వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యాకన్న మాట్లాడుతూ మొగల్రాజపురం మధుచౌక్ సెంటర్‌లోని మొఘల్ హాల్లో మార్చి 3 నుంచి పది రోజుల పాటు ఈ మహిళా ఉత్సవ్ జరుగుతుందన్నారు. తమ సంస్థ నిర్వహించిన వృత్తి విద్యా శిక్షణ కోర్సులను పూర్తి చేసిన మహిళలు ఎంతో మంది పారిశ్రామికవేత్తలుగా మారారని చెప్పారు. మహిళలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ కల్పించి వారిని మరింతగా ప్రోత్సహించేందుకు మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ మహిళా ఉత్సవ్‌లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 28 తేదీ లోగా రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నగరాభివృద్ధికి మరింత కృషి



మేయర్ అధ్యక్షతన సమావేశమైన స్థాయీ సంఘ సభ్యులు

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థను మరింత అభివృద్ధి చేయటానికి తాము కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ కమాండ్‌కంట్రోల్ రూంలో సోమవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మొత్తం 21 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 13 ఆమోదిస్తూ సభ్యులు తీర్మానం చేశారు. 5 అంశాలు వాయిదా వేయగా రెండు ఆమోదించగా ఒక అంశాన్ని ధ్రువీకరణ చేశారు.

- మూడు సర్కిళ్లలోని స్లమ్ ఏరియాలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించే నిమిత్తం ఏడు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.
- 63వ డివిజన్ రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీలో వీఎంసీ నిర్మించిన మల్టిపర్పస్ హాలును మూడేళ్ల లీజుకు ఇచ్చే అంశంపై సభ్యులు వాయిదా వేశారు
- వీఎంసీ కమిషనర్ నగర పర్యటనకు వినియోగించే కారు తరచూ మరమ్మతులకు గురవుతున్నందున కొత్త కారు కొనుగోలు చేయటానికి వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

తలశిల రఘురామ్‌కు పరామర్శల వెల్లువ



రఘురామ్‌ను పరామర్శిస్తున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు, మంత్రి కారుమూరి

భవానీపురం(విజయవాడపశ్చిమ):ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు ప్రజాప్రతినిధులు, ప్రముఖుల పరామర్శలు వెల్లువెత్తాయి. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం రాత్రి పొద్దుపోయాక ఎన్టీఆర్‌జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఆయన నివాసానికి వచ్చి రఘురామ్, కుటుంబసభ్యులను పరామర్శించారు. కాగా సోమవారం కూడా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు వచ్చి స్వర్ణకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. వారిలో మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), పుప్పాల శ్రీనివాసరావు (వాసు), దూలం నాగేశ్వరరావు, మొండితోక జగన్‌మోహన్‌రావు, అనిల్‌యాదవ్, ధర్మాన కృష్ణదాస్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవికుమార్, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, జూపూడి ప్రభాకర్, రాయపాటి శ్రీనివాసరావు, సుంకర పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. అలాగే ఏఎమ్‌సీ చైర్మన్ కారంపూడి సురేష్, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీటీసీ ధనేకుల చౌదరి, గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గంగవరపు శివాజీ, బొర్రా తిరుపతిరావు, జాస్తి జగన్, గేరా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పాయకాపురం(విజయవాడరూరల్): పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్న ఘటన పటేల్‌నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. నిందితుల నుంచి రూ.31,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.